ప్రజల మనిషి మా ఎమ్మెల్యే



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జూలై 26 : ప్రజల మనిషిగా గుర్తింపు సాధించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్యకర్తల మదిలో నిలిచిపోయారని సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 43 మందికి రూ.12.55లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీతో సంబంధం లేకుండా ఈ పని నాకు చేయాలని ఎమ్మెల్యేను కలిస్తే తానే స్వయంగా ప్రభుత్వంతో మాట్లాడి చేసే నాయకత్వ లక్ష్యమున్నా నాయకుడని కొనియాడారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన ఏ సమస్యలున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలమలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, నాయకులు శివరాజ్ పాటిల్, మధుసూదన్‌రెడ్డి, చక్రపాణి, ఆర్.వెంకటేశ్వర్లు, పాండు, రుక్మద్దీన్, శ్రీధర్‌రెడ్డి, శంకర్ గౌడ్, కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, తాళ్ల నర్సింహాగౌడ్, నందకిషోర్, రాంచందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మాచునూర్‌లో అధికారుల విచారణ

■ ఇల్లు ఒకరివి.. అమ్మింది ఇంకోకరూ.. ■ విలేకరులను కార్యాలయంలోకి అనుమతించని విచారణ అధికారి ■ సస్పెండ్ చేయాలని గ్రామస్తుల డిమాండ్



మాచునూర్‌లో విచారణ చేపడుతున్న డీఎల్పీవో అమృత, ఇతర అధికారులు



తారుమారైన ఇండ్ల వద్దకు వెళ్లి పత్రాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఝరాసంగం, జూలై 26 : మండల పరిధిలోని మాచునూర్ గ్రామంలో ఒకరి ఇంటిని వారి కుటుంబ సభ్యులకు తెలియకుండానే అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి వేరే గ్రామానికి చెందిన వ్యక్తి పేరుపై పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో కలిసి మార్పిడి చేశారు. ఖాళీ స్థలాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయించారు. అలా మార్పిడి జరిగిన ఇండ్లు, ఖాళీ స్థలాలపై వారు బ్యాంకులో రుణాలు తీసుకున్నారని బాధితులు ఆరోపించారు. ఇలా గ్రామంలో దాదాపు 40 వరకు ఇదే తంతు కొనసాగిందని అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో అమృత, మండల ప్రత్యేక అధికారి హైనిష్, ఎంపీడీవో సుధాకర్‌ల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామస్తులు కార్యాలయం బయట విచారణ చేపట్టాలని ఆందోళన చేశారు. అధికారులు పట్టించుకోకుండా కార్యాలయంలోనే విచారణ చేపట్టారు. విచారణ చేపట్టడానికి వచ్చిన అధికారి విలేకరులను కార్యాలయంలోకి అనుమతించలేదు. విచారణ అదికారుల తీరుపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలపడంతో బయటికి వచ్చి పలువురు బాధితులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులు గ్రామంలో పర్యటించి తారుమారైన ఇండ్ల వద్దకు వెళ్లి పత్రాలను పరిశీలించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. తదనంతరం గ్రామంలో ఆందోళన జరుగుతుందనే విషయన్ని తెలుసుకుని ఎస్సై నరేశ్ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకొని బాధితులతో మాట్లాడి సముదాయించారు.

తాగునీరు సరఫరా చేయండి

సంగారెడ్డి, జజూలై 26 : జిల్లా కేంద్రంలోని 11, 12 వార్డుల్లో భగీరథ నీళ్లు రాక ఆయా కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అధికారులకు విన్నవించారు. శుక్రవారం స్థానిక మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. వెంటనే తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్, సహ కార్యదర్శి పాండురంగం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సదాశివపేట, జూలై 26 : శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవా రం పట్టణంలోని సదాశివ పిరమిడ్ ఉచిత ధ్యాన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న సంగారెడ్డిలో శాఖాహార ర్యాలీ నిర్వహించనున్నామని అధిక సంఖ్యలో పా ల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బోధన్ మాస్టర్ సాయిలు, మేడం రాజలక్ష్మి, సదాశివపేట పిరమిడ్ మాస్టర్ కృష్ణ, సత్యనారాయణగౌడ్, సంగమేశ్వర్, పురం రజిని కృపాకర్, ఆటో సంగమేశ్వర్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలను పూడ్చాలి

సదాశివపేట, జూలై 26 : పట్టణం నుంచి మోమిన్‌పేట్ వెళ్లే రహదారిపై గుంతలను పూడ్చాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ కోరారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న గుంతలను పరిశీలించారు. రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి, గజిని, గని, ముజీబ్, నవాజ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

పటాన్‌చెరు, జూలై 26 : ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర కార్యదర్శి మడపతి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఇస్నాపూర్‌లో రాష్ట్ర కండర క్షీణత వ్యాధి బాధితుల సంక్షేమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల తెలివి తేటలను బలహీన పరుస్తూ మాట్లాడిన స్మితా సబర్వాల్ దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలనిడిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గంజాయి సాగు చేస్తే జైలుకే

సిర్గాపూర్, జూలై 26 : మండల పరిధిలో గంజాయి సాగు, అమ్మకం, అక్రమ రవాణా చేస్తే ప్రభుత్వ లబ్ధి పథకాలన్నీ రద్దుతో పాటు జైలుకు పంపిస్తామని సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు, విక్రయాలపై తెలిస్తే వెంటనే సమాచారమందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ట్రాన్స్‌కో ఏఈకి సన్మానం

కోహీర్, జూలై 26 : మండల పరిధిలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించి ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్తున్న విద్యుత్ శాఖ ట్రాన్స్ కో ఏఈ మనీశ్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఈఈ లక్ష్మీనారాయణ, మధుసూదన్ రజినీకాంత్, తెలంగాణ విద్యుత్ వర్క్స్ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రశాంత్, సతీశ్, నాగరాజు, అర్జున్, జగదీశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కూలీ పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

బాబురావు

బొల్లారం, జూలై 26 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన మూస్కు బాబురావు (46) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న ఇంట్లో నుంచి కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొక్కల పెంపకంతోనే మానవాళికి మనుగడ

అందోల్, జూలై 26 : మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య అన్నారు. వనమహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అలీఅబ్బాస్ జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

గుమ్మడిదల, జూలై 26 : అలీ అబ్బాస్ జాతర వాల్ పోస్టర్‌ను శుక్రవారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. మండల పరిధిలోని మంభాపూర్‌లో నిర్వహించే ఈ జాతర ఈ నెల 28నుంచి 30వరకు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, జాతర నిర్వాహకులు నందగిరి కిషన్‌రావు, నందగిరి ప్రభాకర్‌రావు, వెంకట్రావు, రాఘవేంద్రరావు, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగూడెంలో ఘనంగా దుర్గమ్మ తల్లి జాతర

పూజలు చేస్తున్న పలు పార్టీల నాయకులు

గుమ్మడిదల, జూలై 26 : మండలంలోని వీరన్నగూడెంలో గ్రామస్తులందరూ కలిసి దుర్గమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని దుర్గమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుల దరువులతో కనుల పండువగాబోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సద్దిప్రవీణావి జయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మమతావేణు, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

ఆర్‌ఆండ్‌బీ డీఈఈ నర్సింహులుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోహీర్, జూలై 26 : జహీరాబాద్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని రైల్వే బ్రిడ్జి వంతెన వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పరిసరాలను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందని వెంటనే పూర్తి చేయాలని డీఈఈ నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నరేశ్, బాల్‌రాజ్, సూరి, నసీమొద్దీన్, ముజాహిద్, తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ అధ్యక్షుడిగా మనోహర్

నూతన అధ్యక్షుడితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జూలై 26 :పటాన్‌చెరు డివిజన్ 113 పరిధిలోని పంచముఖి వీరాంజనేయస్వామి ఆలయ నూతన అధ్యక్షుడిగా కొండా మనోహర్ గుప్తా ఎంపికయ్యారు. శుక్రవారం ఆలయంలో మనోహర్ గుప్తాతో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు

బోనాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సంగారెడ్డి, జూలై 26 : ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నామని సంఘం నాయకుడు పిట్టల రమేశ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శివాజీనగర్‌లోని ముదిరాజ్ సంఘ కార్యాలయలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సమీపంలోని సంగమేశ్వర ఆలయం నుంచి సామూహిక బోనాల ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు జనార్దన్, శ్రీనివాస్, రామకృష్ణ, తిరుమల్, బొట్టు వెంకటేశం, నర్సింహులు, యూత్ సభ్యులు రమణ, ఎస్‌వీ శ్రీను, సాయి బాషా, బస్వరాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళ న చెందవద్దు

మనూరు, జూలై 26 : రుణాల విషయంలో రైతులు ఆందోళన చెందరాదని జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోనీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అతిమ్యాల్ గ్రామంలో గాయత్రి షుగర్ కేన్ జీఎం వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, ఏవోలు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశం, ఫ్యాక్టరీ సిబ్బంది ప్రసాద్, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అగ్రోస్ రైతు సేవా కేంద్రం తనిఖీ

అందోల్, జూలై 26 : మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు కేంద్రం-1 ను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోనీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి విజయరత్న ఉన్నారు.

అవగాహన కల్పించాలి

నాగల్‌గిద్ద, జూలై 26 : వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోనీ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కరస్‌గుత్తి గ్రామాన్ని ఏడీఏ నూతన్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోమనూర్ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో శ్రావంతి పాల్గొన్నారు.

మెట్రో రైలు పొడిగించలేదని ధర్నా

జహీరాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కోహీర్, జూలై 26 : సంగారెడ్డి జిల్లాకు మెట్రో సేవలు అందించకుండా తీవ్ర అన్యాయం చేశారని బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెట్రో రైలును పటాన్‌చెరు వరకు మాత్రమే నడిపేందుకు బడ్జెట్ ప్రసంగంలో చెప్పారన్నారు. ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని సంగారెడ్డి వరకు మెట్రో లైన్ పొడిగిస్తే బాగుండేదన్నారు. జిల్లా ప్రజలను అవమాన పరిచినందుకు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, సంతోశ్, వైద్యనాథ్, దుర్గయ్య, విశ్వనాథ్, శ్రీకాంత్, ఓంకార్, కిష్టయ్య, రమేశ్, గోపాల్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ శుక్రవారం నారాయణఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం, నాయకులు రజినికాంత్, కో కన్వీనర్ నగేశ్‌యాదవ్, నాయకులు రాజుగౌడ్, సంజీవ్, సిద్దయ్యస్వామి పాల్గొన్నారు.

ర్యాకల్ పాఠశాలపై మచ్చందర్ ఉదారత

మచ్చందర సహకారంతో పాఠశాల ఆవరణను చదును చేయిస్తున్న స్థానికులు

నారాయణఖేడ్, జూలై 26 : మండల పరిధిలోని ర్యాకల్ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ కోసం నిర్మించిన గదిని వినియోగించడం లేదు. దీంతో ఆకతాయిలు సదరు గదిలో పేకాడుతున్న విషయాన్ని గురువారం 'నమస్తే తెలంగాణ'లో పాఠశాలలో పత్తాలాట అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఎన్ఆర్ఐ గుర్రపు మచ్చందర్ స్పందించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు గదిని వినియోగంలోకి తెచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తానని స్వచ్ఛందంగా ముందుకు రావడంతో పాటు వెంటనే అవసరమైన పనులను ప్రారంభించారు. సైన్స్‌ల్యాబ్ గది పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలిగించి చదును చేయడమే కాకుండా గదిని శుభ్రం చేయించారు. గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి పాఠశాల వరకు గల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతలను పూడ్చారు. పాఠశాలలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా కార్మికుడిని నియమించారు అధికారులు. గుర్రపు మచ్చందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్థితిలో ఉన్న పాఠశాల పరిసరాలు మెరుగు పడడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

అమీన్‌పూర్, జూలై 26 : ఔటర్ రింగ్ రోడ్డుపై మూత్రం చేస్తున్న బాలుడిపై వాహన టైర్ తగిలి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై సోమేశ్వరీ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డి అదివారం రాత్రి ముత్తంగి హోటల్‌లో కుటుంబంతో కలిసి భోజనం చేసేందుకు తన కారులో బయలుదేరారు. ఔటర్ రింగ్ రోడ్డుపై తన కుమారుడు మోక్షిత్ రెడ్డి (6) మూత్రం వస్తుందని చెప్పగా కారు పక్కకు ఆపి మూత్ర విసర్జన చేయిస్తున్నారు. అదే క్రమంలో గుర్తు తెలియని వాహనం టైర్ ఊడిపోయి దొర్లుకుంటూ అకస్మాత్తుగా మీదకు వచ్చి డీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ముత్తంగిలోని ఓ ప్రవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని మరో దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విషమించి గురువారం రాత్రి బాలుడు మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తమ్ముడినని నమ్మించి రూ.70వేల మోసం

బొల్లారం, జూలై 26 : సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.70వేలు పోగొట్టుకున్న ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విగ్నేశ్వర కాలనీలో జరిగింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. బొల్లారం పారిశ్రామిక వాడలోని విగ్నేశ్వర కాలనీలో నివసించే అనునటాని భార్యకు ఈనెల 25న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో ఉండే తమ్ముడినని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో మాట్లాడి రూ.70 వేలు పంపించమన్నాడు. నిజమని నమ్మిన బాధితులు డబ్బులు పంపించారు. మరో రూ.30 వేలు పంపించమనగా అనుమానం వచ్చి ఫోన్ చేశారు. రెస్పాన్స్ రాకపోవడంతో మోసపోయిన విషయం గ్రహించారు. వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

అందోల్, జూలై 26 : జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించినట్లు పీఆర్టీయూ పత్రికా సంపాదకవర్గ సభ్యుడు మాణయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అవిశ్వామన్నారు... పత్తాలేకుండా పోయారు

బీబీపేట్‌లో అవిశ్వాసం కోరిన డైరెక్టర్ల కోసం వేచి చూస్తున్న జిల్లా అధికారులు

కల్హేర్, జూలై 26: కల్హేర్ మండలం బీబీపేట్ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసం కోరిన డైరెక్టర్లు హాజరు కాకపోవడంతో జిల్లా అధికారులు ఏమి చేయలేక తిరిగి వెళ్లిపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది. పీఏసీఎస్‌లో 13 డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ మృతి చెందాడు. ఈ నెల 5న పీఏసీఎస్‌కు చెందిన ఏడుగురితో కలిసి వైస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు శుక్రవారం అవిశ్వాస ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు నిర్ణయించి నోటీసులు జారీ చేశారు. ఉదయం 10గంటలకు డీసీవో తుమ్మ ప్రసాద్, అస్టిస్టెంట్ రిజిష్ట్రార్లు సిద్ధారెడ్డి, చిన్నారెడ్డిలు పీఏసీఎస్‌కు చేరారు. 10నుంచి 12.30గంటల వరకు అధికారులు డైరెక్టర్ల కోసం వేచి చూశారు. ఏ ఒక్క డైరెక్టర్ హాజర్ కాకపోవడంతో ఏమి చేయలేక అధికారులు వెళ్లిపోయారు. అవిశ్వాసం వీగిపోవడంతో బీబీపేట్ పీఏసీఎస్ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి కొనసాగనున్నారు.

భెల్ పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, జూలై 26 : భెల్‌లోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం బోనాల సందర్భంగా శుక్రవారం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బోనాల కోసం అమ్మవారి ఆలయాన్ని ముస్తాబుచేశారు. భెల్ ఈడీ కేబీరాజా పూజా కార్యక్రమంలో పాల్గొని బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. బోనాల రోజు సుమారు లక్ష మంది వరకు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. కార్యక్రమంలో ఈడీ, పీఈ, ఎస్‌డీ వై.శ్రీనివాస్‌రావు, జీఎంహెచ్‌ఆర్ వి.శ్రీనివాస్‌రావు, జీఎం, ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ వాటర్ ట్రయల్ రన్

బొల్లారం, జూలై 26 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చేపడుతున్న చర్యలు తుది దశకు చేరుకున్నాయి. శుక్రవారం హెచ్ఎండబ్ల్యూ సిబ్బంది ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటి సరఫరా ట్రయల్ రన్ నిర్వహించారు. పైపు లైన్ల ద్వారా విడుదల చేసిన నీరు సమీపంలోని కేబీఆర్, వైఎస్సార్ కాలనీ రోడ్లపైకి భారీగా చేరింది. మిషన్ భగీరథ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలోనే తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

పచ్చని చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

న్యాల్‌కల్, జూలై 26 : పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదపడుతాయని హైదరాబాద్ రంజీ క్రికెటర్ నాగేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎపీవో రంగరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 26 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో ప్రారంభం కానున్న అండర్-16 ఇంటర్ స్కూల్, కాలేజీస్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలో ఉన్న ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. క్రీడాకారులు 2028 సెప్టెంబర్ 1 నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న క్రికెట్ క్రీడాకారులు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

బాధితులకు పోయిన సెల్‌ఫోన్లు అప్పగింత

సంగారెడ్డి